సాక్షి
చిత్తూరు

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు
కుప్పం నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు మంత్రి పెద్దిరెడ్డి సమక్షం లో వైఎస్సార్‌సీపీలో చేరారు. - IIలో



అసత్యాలు.. అపసోపాలు
కుప్పం కెనాల్‌లో హంద్రీ–నీవా జలాలపై ఈనాడు ప్రచురితమైన తప్పుడు కథనంపై ఫ్యాక్ట్ చెక్. - IIలో



కోటీశ్వరులకే 'మొదట'
టీడీపీ అధినేత చంద్రబాబు కోటీశ్వరులకే జై కొట్టారు. తొలి జాబితాలో డబ్బున్నవారికే ప్రాధాన్యమిచ్చారు. - IIలో

న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

శాంతిపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 26వ తేదీన కుప్పం నియోజకవర్గం లో పర్యటించనున్న రాజుపేట, మఠం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్ శనివారం వేర్వేరుగా పరిశీలించారు. హెలీప్యాడ్, బహిరంగ సభావేదిక, పార్కింగ్ స్థలాలను సందర్శించి పలు సూచనలు చేశారు. శాఖలవారీగా అప్పగించిన పనులను సమీక్షించారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ,, ఎస్పీ జాషువా, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఉమామహేశ్వర్, ఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణారెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

జేసీ వీడియో కాన్ఫరెన్స్

చిత్తూరు కలెక్టరేట్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. బహిరంగ సభ వద్ద గ్యాలరీ ఇన్‌చార్జిలుగా నియమితులైన వారు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డీఆర్‌ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న, డీఈఓ దేవరాజు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సమావేశం

చిత్తూరు అర్బన్: నగరంలోని పోలీస్ అతిథిగృహంలో రాబోయే సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఎస్పీ జాషువా శనివారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధులకు అధికారులు సమాయత్తం కావాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల్లో మద్యం, వస్తువుల తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నేరగాళ్ల కదలికలను ఎప్పటికప్పుడు గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడే గ్రూప్–2 పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా 20 కేంద్రాల్లో ఆదివారం గ్రూప్–2 పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షలకు మొత్తం 9,441 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న పరీక్షలకు అభ్యర్థులు సకాలంలో రావాలని అధికారులు సూచించారు. ఏమైనా సమస్యలుంటే హెల్ప్‌డెస్క్ 9491077356 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కుప్పం.. నవశకం

దశాబ్దాలుగా మోసిన కుప్పం ప్రజలకు చంద్రబాబు చేసింది శూన్యం.. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా సొంత నియోజకవర్గానికి మేలు చేయడంలో విఫలం..
కేవలం మోసపు హామీలతో కుప్పం వాసులను మభ్యపెట్టి గెలుపొందేవారు.
ఎన్నికలు వస్తే చాలు హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకువస్తానంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పేవారు. తర్వాత ఇచ్చిన మాటను పూర్తిగా విస్మరించేవారు. అన్నేళ్లపాటు పరిపాలించినా కుప్పం పంచాయతీని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయడం సంగతి దేముడెరుగు.. కనీసం రెవెన్యూ.. పోలీస్ డివిజన్‌లు ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా చేయలేకపోయారు. అదే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనా కుప్పం ప్రగతికి కట్టుబడింది. పురపాలక సంఘం హోదా కల్పించింది. రెవెన్యూ.. పోలీస్ డివిజన్‌లను ప్రారంభించింది. హంద్రీ–నీవా ద్వారా కృష్ణాజలాలను తీసుకువచ్చింది. నియోజకవర్గ అభివృద్ధికి రూ.వందల కోట్లు వెచ్చించింది. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించింది.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శరవేగంగా అభివృద్ధి
- హంద్రీ–నీవా జలాలతో దశాబ్దాల కల సాకారం
- మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడంతో కుప్పంలో ప్రగతి పరుగులు
- రెవెన్యూ.. పోలీస్ డివిజన్ల ఏర్పాటుతో తీరిన సమస్యలు
- సీఎం వైఎస్ జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



రాజుపేట వద్ద నీటితో కళకళలాడుతున్న హంద్రీ–నీవా కాలువ



కుప్పం ఆర్‌డీఓ కార్యాలయం

కుప్పంరూరల్ : టీడీపీ అధినేత చంద్రబాబు ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా కుప్పం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా విధులు నిర్వర్తించారు. అయితే తన సొంత నియోజకవర్గంలో చెప్పుకోదగిన అభివృద్ధి పనులు చేయలేకపోయారు. కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేక పోయారంటే చంద్రబాబు చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే కుప్పంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కావడం గమనార్హం. అదే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం కుప్పం ప్రగతి పురోగతికి చర్యలు చేపట్టారు. ఐదేళ్లలోనే అభివృద్ధి పనులను పరుగులు పెట్టించారు. కుప్పం వాసులకు కలగా ఉన్న హంద్రీ–నీవా జలాలను తీసుకువచ్చి దాహార్తిని తీర్చారు. ఆర్‌డీఓ కార్యాలయం. డీఎస్పీ ఆఫీస్‌ను ఏర్పాటు చేశారు. పంచాయతీగా వెనుకబడిన కుప్పం పట్టణానికి పురపాలక హోదా కల్పించి ముందంజలోకి తీసుకువచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయం వారి మాటల్లోనే..

నిర్మాణంలో కుప్పం మున్సిపల్ కార్యాలయం



నిర్మాణంలో ఉన్న వాల్మీకుల కమ్యూనిటీ భవనం



కుప్పంలో నిర్మించిన వన్నెకుల క్షత్రియ కమ్యూనిటీ భవనం



శుభ పరిణామం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో కమ్యూనిటీ భవనాలు లేని కులాలకు నూతనంగా నిర్మిస్తున్నారు. ఇది శుభ పరిణామం. వన్నెకుల క్షత్రియ, వాల్మీకి, కురబ కులస్తులకు కోట్లాది రూపాయలతో ఇప్పటికే కుప్పంలో కమ్యూనిటీ భవనాలు నిర్మించారు. గాండ్ల కులం కమ్యూనిటీ భవన నిర్మాణానికి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా భూమి పూజ చేయడం ఆనందంగా ఉంది. అన్ని సామాజిక వర్గాలవారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. వైఎస్సార్‌సీపీ పాలనలోనే అందరికీ సమన్యాయం జరుగుతోంది. సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.
– తులసీకుమార్, రామకుప్పం

నిరీక్షణ తప్పింది



రైల్వే అండర్ బ్రిడ్జీలు లేక గతంలో గేటు దాటాలంటే గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కుప్పం పట్టణం, డీకే పల్లె వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మించడంతో మాకు నిరీక్షణ తప్పింది. గతంలో పింఛన్ల కోసం అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వృద్ధులు, మహిళలు విసిగి వేశారేవారు. అలాగే పట్టణంలో వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ కార్యాలయ భవనాలు ప్రారంభించడంతో మాకు కష్టం తగ్గింది. ఒకే చోట సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్, ట్రెజరీ కార్యాలయాలు ఏర్పాటు చేయడం ఎంతో సౌకర్యంగా ఉంది. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు వచ్చాయి. ఇంటికే వచ్చి వలంటీర్ మాకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు అందిస్తున్నారు.
– అరుణ్, డీకే పల్లె

నీరు వచ్చింది



నిత్యం కరువుతో సతమతమయ్యే కుప్పం ప్రాంతంలో హంద్రీ–నీవా ద్వారా నీటి కష్టాలు శాశ్వతంగా తీరుతాయి. అందుకే నాతోపాటు చాలా మంది రైతులు ఈ కాలువ నిర్మాణానికి భూములు ఇచ్చాం. చంద్రబాబు హయాంలో కాలువ పనులు అరాకొరగా వదిలేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక దాన్ని పూర్తి చేశారు. ఇప్పుడు కాలువలో నీరు వచ్చింది. చెరువులను సైతం కృష్ణా నీటితో నింపుతామంటున్నారు. దీంతో భూగర్భ జలాలు పెరుగుతాయి.
– జి.మనోహర్‌రెడ్డి, రైతు, దండికుప్పం

అపర భగీరథుడు



కృష్ణా నీటి రాకతో కరువు ప్రాంతమైన కుప్పంలో ఇకపై మూడు పంటలు సాగు చేసుకోవచ్చు. గతంలో ఏ నాయకుడు కూడా శాశ్వత సాగు, తాగు నీటి పరిష్కారం చూపలేక పోయారు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకుంటే సహకరించాల్సిన మా ఎమ్మెల్యే చంద్రబాబు అడ్డుకున్నారు. దాంతో మంజూరైన నిధులు సైతం వెనక్కు వెళ్లిపోయాయి. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని హంద్రీ–నీవా జలాలు వచ్చాయి. అపర భగీరథుడు మన ముఖ్యమంత్రి. – రాజశేఖర్, రైతు, గుండిశెట్టిపల్లె

ఊర్లోనే అన్ని సేవలు



ఎన్నడూ లేని విధంగా మా గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం, సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఏ పనైనా సరే బయటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊర్లోనే అన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా పాఠశాల అయితే అద్భుతంగా తీర్చిదిద్దారు. నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నారు.సీసీ రోడ్లు నిర్మించడంతో గ్రామం పరిశుభ్రంగా కనిపిస్తోంది. పింఛన్‌దారులకు ఒకటో తేదీ ఉదయాన్నే నగదు అందుతోంది. పేదలకు పక్కాగా రేషన్ అందిస్తున్నారు. ఇంతకంటే ఏం కావాలి. మరో 30 ఏళ్లు ముఖ్యమంత్రి మా జగనన్నే.
– మదన్‌కుమార్, కొత్తయిండ్లు, కుప్పం మండలం

తీరిన సమస్యలు



చంద్రబాబు 35 ఏళ్లుగా చేయలేని పని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లలోనే చేసి చూపించారు. కుప్పంను రెవెన్యూ, పోలీసు డివిజన్‌గా మార్చి మా కష్టాలు తీర్చారు. ఏదైనా రెవెన్యూ సమస్యలు తలెత్తితే ఆర్డీఓను కలిసేందుకు గతంలో మదనపల్లెకు వెళ్లాల్సి వచ్చేంది. కుప్పంను రెవెన్యూ డివిజన్ చేయడంతో మా సమస్యలు ఇక్కడే తీరుతున్నాయి. డీఎస్పీని కలవాలంటే పలమనేరుకు వెళ్లే శ్రమ తప్పింది.
– శ్రీనివాసులు, గుడ్లనాయనిపల్లె

'పాలారు' స్వప్నం.. సాకారం చేస్తాం!

- 26న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి





సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, భూమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కుప్పం : పాలారు ప్రాజెక్టు నిర్మించి కుప్పం నియోజకవర్గ ప్రజల స్వప్నం సాకారం చేస్తామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. శనివారం పట్టణంలో గాండ్ల కులస్తుల కమ్యూనిటీ భవన నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి భూమి పూజ చేశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పాలారు ప్రాజెక్టుకు 2004లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. భూసేకరణకు రూ.54 కోట్లు మంజూరు చేశారని వెల్లడించారు. అయితే చంద్రబాబు కుట్రపూరితంగా కోర్టుకు వెళ్లి ప్రాజెక్టును అడ్డుకున్నారని విమర్శించారు. ఇన్నేళ్లకు కోర్టు ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇచ్చిందని, 26 తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా పాలారు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. దశాబ్దాలుగా చంద్రబాబు చేయలేని అభివృద్ధి పనులను కేవలం ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ చేసి చూపించారన్నారు. ఇచ్చిన హామీ మేరకు హంద్రీ–నీవా జలాలను తీసుకువచ్చామని చెప్పారు. నియోజకవర్గంలోని 54 చెరువులను కృష్ణానీటితో నింపుతున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో హంద్రీ–నీవా కాలువపై ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన కథనంపై మంత్రి మండిపడ్డారు. ప్రస్తుతం గేట్లు పెట్టి నీరు నిల్వ చేశామని, ముఖ్యమంత్రి విడుదల చేయగానే చెరువులను నింపుతామన్నారు. కావాలంటే ఈనాడులోని మేధావుల బృందం ప్రత్యేకంగా పరిశీలించుకోవచ్చని స్పష్టం చేశారు. తప్పుడు కథనాలతో ప్రభుత్వంపై విషంకక్కడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సర్కారు అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తోందని, అందులో భాగంగానే 2 ఎకరాల్లో రూ.3కోట్లు వెచ్చించి గాండ్ల కులస్తులకు కమ్యూనిటీ భవనం నిర్మిస్తున్నట్లు వివరించారు. ఎంపీ రెడ్డెప్ప సైతం ఎంపి నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ పలు రాజకీయ పార్టీలు కులాల పేరుతో చిచ్చురేపుతుంటే, ముఖ్యమంత్రి జగనన్న మాత్రం అన్ని కులాలు తమవే అంటూ ముందుకు దూసుకుపోతున్నారన్నారు. పేద విద్యార్థుల భవిత కోసమే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని తెలిపారు. కుప్పం అభివృద్ధికి జగనన్న కట్టుబడి ఉన్నారని, ఈ విషయాన్ని గుర్తించి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ , మున్సిపల్ చైర్మన్ సుధీర్, గాండ్ల కార్పొరేషన్ చైర్మన్ భవానీప్రియ, గాండ్ల కుల గురువు వీరభద్ర చెన్నస్వామి, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డమ్మ, పార్టీ కుప్పం పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప పాల్గొన్నారు.

ఆర్‌బీకే.. డీసీసీబీ బ్రాంచ్ ప్రారంభం

రామకుప్పం: మండలంలోని మిట్టపల్లి సమీపంలో రూ.21.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఆర్‌బీకే భవనం, అలాగే రామకుప్పంలో నూతనంగా ఏర్పాటుచేసిన చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. జేసీ శ్రీనివాసులు, జానపద కళల కార్పొరేషన్ చైర్మన్ కొండవీటి నాగభూషణం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్పగౌడ్, తహసీల్దార్ శ్రీధర్ పాల్గొన్నారు.



రామకుప్పం : డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు


కుప్పం : కండువాలు కప్పుతున్న మంత్రి పెద్దిరెడ్డి

కుప్పం : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో శనివారం పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. కుప్పంలో నిర్వహించిన గాండ్ల కులస్తుల ఆత్మీయ సమావేశంలో చందం గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వి.మిట్టపల్లెకు చెందిన చెన్న కేశవులు, ఆటో కుమార్, హనుమంతు, రంజిత్ , విఘ్నేష్‌లతో పాటు పలువురికి మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: టీడీపీకి చెందిన స్థానిక మైనారిటీ నేత తస్లీద్ సైతం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. మంత్రి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తస్లీద్ మాట్లాడుతూ కుప్పంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, కో–ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, మైనారిటీ నేతలు అబ్దుల్‌సాబ్, అబ్దుల్ ఖుద్దూస్, సిరాజ్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డిగ్రీ సెమిస్టర్ హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ 5వ సెమిస్టర్ హాల్ టికెట్లను అభ్యర్థులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కో–ఆర్డినేటర్ మీరా సాహెబ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి మార్చి 2వ తేదీ వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. www. brouonline.in వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 7382929664, 9573607925 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అద్దె బస్సులకు ఈ–టెండర్లు

చిత్తూరు రూరల్: అద్దె బస్సుల కోసం ఈ–టెండర్లు పిలుస్తున్నట్లు డీపీటీఓ నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు వన్‌డిపోకు 8, డిపో–2కు 7, కుప్పం 4, పలమనేరుకు 6, పుంగనూరుకు 7 టెండర్లు ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. వివరాలకు www.apsrtc.ap.gov. in వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

అసత్యాలు.. ఆపసోపాలు

కరువు సీమ కుప్పానికి కృష్ణా జలాలు ఇవ్వడంలో చంద్రబాబు వైఫల్యాన్ని దాచేందుకు ఎల్లో మీడియా ఆపసోపాలు పడుతోంది. హంద్రీ–నీవా కాలువ పనులు పూర్తి చేయడమే కాకుండా, నీటి విడుదలకు సిద్ధమైన ప్రభుత్వంపై బురదజల్లేందుకు అసత్య కథనాలను వండి వారుస్తోంది. ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్విజయంగా కుప్పం వాసుల దాహార్తిని తీరుస్తుంటే అరచేతిని అడ్డుపెట్టేందుకు విఫలయత్నం చేస్తోంది. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను మభ్యపెట్టేందుకు అబద్ధాలను వల్లిస్తోంది. అందులో భాగంగా శనివారం ఈనాడు దినపత్రికలో 'రాజుపేట వరకే కృష్ణా జలాలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఫ్యాక్ట్ చెక్.

- రాజుపేట నుంచే కుప్పం కాలువకు కృష్ణా జలాలు
- వాస్తవాలను కప్పిపుచ్చేందుకు ఎల్లోమీడియా అబద్ధపు కథనాలు


రాజుపేట వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీరు విడుదల చేయనున్న గేటు పనులు చేస్తున్న దృశ్యం

శాంతిపురం : వి.కోట మండలంలోని ఆదినేపల్లె వద్ద లిఫ్ట్ హౌస్ తర్వాత హంద్రీ–నీవా జలాలు వర్థికుప్పం వద్ద కుప్పం నియోజకవర్గంలో ప్రవేశిస్తాయి. అయితే అక్కడ ముఖ్యమంత్రి వచ్చి నీరు విడుదల చేసేందుకు అనువైన ప్రాంతం లేదు. దీంతో అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలోని రాజుపేట వద్ద నుంచి కుప్పం కెనాల్‌కు నీరు విడుదల చేయడానికి అధికారులు సన్నాహాలు చేశారు. ఇందుకోసం రాజుపేట వద్ద కల్కి ఆశ్రమ సమీపంలో గేట్ వాల్వ్ ఏర్పాటు చేశారు. అయితే ప్రభుత్వ చిత్తశుద్ధిని తక్కువ చేసేందుకు ఎల్లోమీడియా అసత్య కథనాలకు తెరతీసింది. ప్రారంభానికి ముందే రాజుపేటను దాటి దిగువ ప్రాంతాలకు నీరు రాదనే విషయాన్ని దాచి ప్రజలను మభ్యపెట్టేందుకు యత్నిస్తోంది.

ఇచ్చిన మాట మేరకు..

2022లో కుప్పం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు కృష్ణా జలాలను తీసుకువచ్చారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీరు అందుబాటులో లేకపోయినా జలాలను కుప్పం కెనాల్‌కు కేటాయించారు. అయితే అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లోని ఇతర కాలువలకు నీరు ఇవ్వకుండా ఇక్కడికి తెచ్చేస్తున్నారని ఇదివరకే ఈనాడు తన ఆక్రోశం వెళ్లగక్కింది. కృష్ణా నదికి వరదలు వచ్చినప్పుడు కూడా అన్ని కాలువలకు ఏక కాలంలో నీటి విడుదల సాధ్యం కాదని అధికారులు చెబుతున్నా.. ప్రభుత్వంపై యథేచ్ఛగా బురదజల్లేందుకు తెగబడుతోంది.

జల పూజ, సభాస్థలిపైనా ఏడుపే..!

రామకుప్పం మండలం రాజుపేట వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జలాలకు పూజలు చేయనున్నారు. అలాగే, శాంతిపురం మండలంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొననున్నారు. దీనిపైనా ఈనాడు దినపత్రిక ఆరోపణలు గుప్పించింది. వాస్తవానికి రాజుపేట వద్ద రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చినా ఇబ్బంది పడే పరిస్థితి. ఈ కారణంగా కుప్పం నియోజకవర్గంతో పాటు బైరెడ్డిపల్లె, వి.కోట మండలాల నుంచి లక్షలాదిగా తరలివచ్చే ప్రజల సౌకర్యార్థం శాంతిపురం మండలంలోని మఠం వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశారు.

పనులు పూర్తి చేశాం

కుప్పం కెనాల్ పనులు పూర్తయ్యాయి. మూడు పంప్‌హౌస్‌ల ద్వారా నీటి లిఫ్టింగ్ సాగుతోంది. ఇన్‌స్పెక్షన్ ట్రాక్, అక్విడక్టులు, ఓటీ పాయింట్లతో సహా అన్నీ పూర్తి చేశాం. పూర్తిస్థాయిలో నీటి విడుదలకు సిద్ధంగా ఉన్నాం. కాలువ చివరన ఉన్న పరమసముద్రం చెరువు వరకు నీటి సరఫరాకు ఎలాంటి అడ్డంకి లేదు. ముఖ్యమంత్రి చేతులమీదుగా నీటి విడుదలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. రాజుపేట వద్ద నీరు వదిలితే శాంతిపురం మండలంలోకి ప్రవేశిస్తాయి.

– రమేష్‌బాబు, ఈఈ, హంద్రీ–నీవా ప్రాజెక్టు

అలవోకగా అబద్ధాలు

గత టీడీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల కిందటే వి.కోట మండలం కృష్ణాపురం వరకు నీరు పారించారని, భూసేకరణ సమస్యలతో కేవలం 13 శాతం పనులే పెండింగ్ ఉన్నాయని ఈనాడు అలవోకగా అబద్ధాలను అచ్చేసింది. కానీ కుప్పం కెనాల్‌లో పశుపత్తూరు వద్ద ఉన్న పంప్ హౌస్ -1లో దాదాపు 30 శాతం పనులు పెండింగ్‌లో ఉన్నా తాత్కాలిక ఏర్పాట్లతో' నాడు కృష్ణాపురం వరకు నీరు తెచ్చారు. కృష్ణాపురం వద్ద ఉన్న పంప్ హౌస్–2 పనులు 50 శాతం, ఆదినేపల్లె వద్ద పంప్ హౌస్–3లో కేవలం 30 శాతం లోపే అప్పట్లో పనులు చేశారు. మొత్తం 5 కిలోమీటర్ల మేర కాలువ తవ్వకం పనులు పెండింగులో ఉన్నాయి. దీనికి తోడు 19 అక్విడక్ట్(నీరు ప్రవహించే వంతెన కాలువ)ల పనులు అసంపూర్తిగా వదిలేశారు. మరో రెండు అక్విడక్టుల నిర్మాణం పూర్తిగా చేయలేదు. మొత్తం 13 కిలోమీటర్ల పైప్ లైన్‌లో 500 మీటర్లు పని చేయలేదు. ఎక్కడా ఎయిర్ వాల్వులు పెట్టలేదు. చెరువులకు నీటి విడుదల కోసం మొత్తం 35 ఓటీ పాయింట్లు అవసరం ఉండగా వీటిలో ఐదు మాత్రమే అప్పట్లో అసంపూర్తిగా పనులు చేశారు. ఆయా పెండింగ్ పనులు గత ఏడాదిన్నరలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసింది.


రాజుపేట వద్ద నిండుగా కుప్పం కెనాల్‌లో హంద్రీ-నీవా జలాలు

కోటీశ్వరులకే 'మొదట'!

- చిత్తూరు, జీడీనెల్లూరు, సూళ్లూరుపేట తెరపైకి క్యాష్ పార్టీలు
- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పూతలపట్టులో బొమ్మాబొరుసాట
- అధినేతలను పక్కనబెట్టి ఎవరికి వారు ప్రచారం
- పార్టీని నమ్ముకున్న వారికి మొదట్లోనే హ్యాండిచ్చిన చంద్రబాబు

సాక్షి, తిరుపతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మొదట కోటీశ్వరులకే జై కొట్టారు. మొదటి విడత జాబితాలో కేవలం ధనవంతులకే టిక్కెట్లు ప్రకటించి తన మార్క్‌ను చాటుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చిత్తూరు, గంగాధరనెల్లూరు, సూళ్లూరుపేట నుంచి పోటీ చేయనున్న ముగ్గురు అభ్యర్థులు కొత్త వారు ధనవంతులు కాగా.. కుప్పం, పలమనేరు, నగరి, గూడూరు నియోజకవర్గాల అభ్యర్థులు మాత్రం పాతవారే ఉన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల మొదటి జాబితా శనివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు సొంత జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు మొదటి జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో గందరగోళంలో పడ్డారు. చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి, సత్యవేడు నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించుకున్న పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యేలు ఆనం రామ్ నారాయణరెడ్డి, కోనేటి ఆదిమూలంకు చంద్రబాబు గట్టి షాక్ ఇచ్చారు. దీంతో వారు, వారి వర్గీయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నమ్ముకుని జర్నలిజం వృత్తిని విడిచిపెట్టి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన మురళీమోహన్ పేరు కనిపించలేదు. పుంగనూరు అభ్యర్థిత్వం కోసం పీకల్లోతు కేసుల్లో ఇరుక్కున్న చల్లా రామచంద్రారెడ్డి పేరు కూడా కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు అసహనం వ్యక్తంచేస్తున్నారు. శ్రీకాళహస్తి అభ్యర్థి తానేనని ప్రచారం చేసుకుంటున్న బొజ్జల సుధీర్‌రెడ్డి పేరు కూడా కనిపించకపోవడంతో ఆయన వర్గీయులు అయోమయంలో పడ్డారు. టీడీపీ నేతల పరిస్థితి ఇలా ఉంటే.. జనసేన నుంచి టికెట్ ఆశిస్తున్న తిరుపతి, గంగాధర నెల్లూరు, శ్రీకాళహస్తి నాయకులు మొదటి జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో పవన్ కళ్యాణ్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



డామిట్ కథ అడ్డం తిరిగింది

తను ఏది చేయాలనుకున్నా ముందుగా లీకులివ్వడం అలవాటైన చంద్రబాబు కుప్పం మారే విషయాన్ని తన సతీమణి నారా భువనేశ్వరి నోట పలికించారు. ఆమె పలికిన పలుకులు పెద్ద దుమారాన్ని రేపాయి. అధినేత పరిస్థితే ఇలా ఉంటే.. తమ పరిస్థితి ఏంటని పోటీచేయాలనుకున్న నేతలంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కథ అడ్డం తిరగడంతో కుప్పం నుంచే పోటీ చేస్తున్నట్లు శనివారం తనకు తానే ప్రకటించుకున్నారు.

ఆశావహులకు నిరాశే

చిత్తూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా గురజాల జగన్‌మోహన్ పేరును ప్రకటించారు. ఇతను పూర్తిగా పార్టీలో కొత్త అభ్యర్థి. వ్యాపారాలు చేసుకుంటూ.. అప్పుడప్పుడూ చంద్రబాబు వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకుని తన సోషల్ మీడియాలో షేర్ చేసుకునేవారు. ఇప్పుడు ఆయన పేరును ప్రకటించటాన్ని స్థానిక టీడీపీ నేతలంతా ఆవేదనలో మునిగిపోయారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారని, కోటీశ్వరుడని ప్రకటించారా? అని ప్రశ్నిస్తున్నారు. చిత్తూరులో బలిజ సామాజిక వర్గానికి చెందిన కటారి హేమలత కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. చిత్తూరులో టీడీపీ జెండా మోస్తూ.. మాజీ మేయర్ కటారి అనురాధ, ఆమె భర్త హత్యకు గురయ్యారు. వీరి కొడుకు కటారి ప్రవీణ్ కూడా అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబానికి అండగా ఉండాల్సిన సమయంలో విస్మరించడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరో కాపు నాయకుడు కాజూరు బాలాజీ కూడా తనకు టికెట్ వస్తుందని ధీమాగా ఉన్నా, నిరాశే మిగిలింది. పొత్తులో భాగంగా చిత్తూరు జనసేన అభ్యర్థి తానేనంటూ ఆదికేశవులు నాయుడు మనవరాలు చైతన్య ధీమాగా ఉన్నారు. ఈమె ఓ అడుగు ముందుకేసి చిత్తూరులో గ్లాసు గుర్తుకే ఓటు వేయాలంటూ తన ఫొటోలతో ఫ్లెక్సీలు కూడా వేయించుకుని ఇప్పుడు నవ్వుల పాలయ్యారు. మరోవైపు చిత్తూరు నియోజకవర్గంలో వన్నియకుల క్షత్రియుల సామాజిక వర్గానికి చెందిన సీఆర్.రాజన్‌కు కూడా బాబు షాక్ ఇచ్చారు.

గ్లాసు బోర్లా!

పొత్తులో భాగంగా తిరుపతి, శ్రీకాళహస్తి, గంగాధరనెల్లూరు, చిత్తూరు టికెట్ల కోసం జనసేన పార్టీ నాయకులు ఎదురుచూశారు. అందులో గంగాధరనెల్లూరు ఒకటి. మొదటి జాబితాలోనే తమ పార్టీకి టికెట్ లేదని తేల్చేయడంతో జనసేన శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన వాటిలో ఉంటాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో గత కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల్లోకి వెళ్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో శ్రీకాళహస్తి అభ్యర్థి తానేనని కోలా ఆనంద్ ప్రకటించుకున్నారు. మరో వైపు పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి టికెట్ తనకే కేటాయిస్తారని వినూత పట్టణంలో హల్‌చల్‌చేస్తున్నారు. ఇంకో వైపు బొజ్జల సుధీర్‌రెడ్డి తనకు కాదని ఎవరికి టికెట్ ఇచ్చేది? అంత సీన్ లేదంటూ తను, భార్య, తల్లి ముగ్గురూ మూడు వైపులా పచ్చ జెండాలు తిప్పేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు సామాజికవర్గం కోటాలో తనకే సీటు అంటూ తన అనుచరుల వద్ద గట్టిగా చెప్పుకుంటున్నారు. మొదటి జాబితాలో శ్రీకాళహస్తి ప్రస్తావన లేకపోవడంతో ఆశావాహులు తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు.